# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 162 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 08 జులై 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## భోగాపురం సిద్ధం..

### విమానాశ్రయం త్వరలో ప్రారంభం

**భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు**

**అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి**

**మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి**

**అమరావతి,మన జనప్రగతి జూలై 07:** ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో మిగతాది 2లో...

# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు

**పదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయం**

**జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి రుణమాఫీ అమలు**

**ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని వారిపై భూసేకరణ కత్తి**

**ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లింపు**

**చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం లో కీలక నిర్ణయాలు**



**అమరావతి,మన జనప్రగతి జూలై 07:** సీఆర్డీఏ సమావేశంలో ఏపీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024 జూన్ నుంచి భూములిచ్చిన వారికి రూ.40వేలు కౌలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. భూములు ఇచ్చినప్పటి నుంచి 10ఏళ్లపాటు ఇది అమలు కానుంది. గ్రామకంఠాల్లో భూమి కోల్పోతున్న వారికి ఏటా రూ.10వేలు ఇచ్చేందుకు అనుమతిని ఇచ్చింది. కొత్తగా పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి ఈ మాఫీ అమలవుతుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్,

మిగతాది 2లో...



## పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

**ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్**

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 07:** పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంత్ర కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు.

మిగతాది 2లో...

## కేరళ,గోవా తరహాలోనే బీచ్ షాక్స్

- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- సామాన్య పర్యాటకులకు దూరంగా ఏర్పాటు
- ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



**రాజమండ్రి,మన జనప్రగతి జూలై 07:** కేరళ, గోవా తరహాలో రాష్ట్రంలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. టూరిజం అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం, సూర్యలంకలో ఫైవ్‌స్టార్ హోటల్స్ ద్వారా బీచ్ షాక్స్‌లో మద్యం విక్రయాలు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. మంగళవారం రంపచోడవరం మండలం పందిరి మామిడిలో నీరా ప్లాంటేషన్‌ను ప్రారంభించారు.

మిగతా2లో...

## పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

**ఇంటింటి సర్వే జరపకుండా మజ్లిస్ శిబిరాల్లో ఫారాల పంపిణీ జరుగుతోందని ఆరోపణ**

**బీఎల్ఓలు నిబంధనలు పాటించడం లేదని ఈసీకి ఫిర్యాదు**

**తెలంగాణ సీఈఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన బీజేపీ నేతలు**



2లో.

## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి**

**మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు**

**ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**

**అహ్మదాబాద్,మన జనప్రగతి జూలై 07:** దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. మిగతా 2లో...



## ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

**రూ.338 కోట్లతో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు**

**నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**రంగారెడ్డి,మన జనప్రగతి జూలై 07:** రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మిగతాది 2లో...



# సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రా పుట్టినిల్లు

**● హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం ● మార్కెట్ సౌకర్యం కల్పిస్తే ఉపాధితో పాటు, కళ సజీవంగా ఉంటుంది**

**● దేశ సంస్కృతి, సంప్రదాయాల కోసం హస్తకళను కాపాడాలి ● వారసత్వాన్ని సజీవంగా కొనసాగిస్తున్న తీరు అభినందనీయం**

**● కళాకారుల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలి ● హస్తకళా మహోత్సవన్‌ను సందర్శించిన డిప్యూటి సిఎం పవన్**



**విజయవాడ,మన జనప్రగతి జూలై 07:** ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మార్కెటింగ్ ఇంకా పెంచగలిగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన ఏపీ హస్తకళా మహోత్సవానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. హస్తకళాకారులను అనారోగ్య సమస్యల నుంచి కాపాడాలన్నారు. తొలుత అందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని, హస్తకళాకారుల పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. వంశపారం పర్యంగా వచ్చిన కళను ముందుకు తీసుకెళ్లడం కూడా ముఖ్యమే. హస్తకళా రంగాలు భారతదేశ మూలాలు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే హస్తకళను, చేనేతను కాపాడుకోవాల్సి ఉందన్నారు. ఒక జాతి గొప్పతనం.. నిర్మించిన భవనాల్లో కాదు.. కళాకారుల్లో కనిపిస్తుంది. కళాకారుల ప్రతిభ.. వారి కష్టాన్ని గుర్తించడానికే ఇక్కడికి వచ్చాను. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. అద్భుత కళల వెనుక లక్షల మంది కళాకారుల కృషి ఉంది. వస్తువుల తయారీ మాత్రమే కాదు.. వారసత్వాన్నీ సజీవంగా ఉంచుతున్నారు. తరతరాల సంప్రదాయాన్ని కళాకారులు కాపాడుతున్నారని

మిగతా2లో...

## ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

### ఈ25 పెట్రోల్ పై కేంద్రం కీలక ప్రకటన

**ఈ25 పెట్రోల్ పై వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచన**

**వాహనాలపై ఈ25 అనుకూలతపై ఇంకా పరీక్షలు జరుగుతున్నాయని వెల్లడి**

**ఈ20 పెట్రోల్ పై మైలేజ్, ఇంజిన్ పనితీరుపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనలు**

**దశలవారీగా, ఆచితూచి మాత్రమే ముందుకు వెళ్తామని ప్రభుత్వ హామీ**




**న్యూఢిల్లీ, మన జనప్రగతి జూలై 07:** దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహన దారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే

మిగతాది 2లో...

# భోగాపురం సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

# ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు.

ముడి చమురు దిగుమతులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరియు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. అయితే, ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బతినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి. అయితే, ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

**హైదరాబాద్,మన జనప్రగతి జూలై 07:** హైదరాబాద్ పాతబస్తీలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని బీజేపీ ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డిని కలిసిన ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరగడం లేదని, దానికి బదులుగా మజ్లిస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారానే ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఫారాల పంపిణీకే పరిమితం కాకుండా, పూర్తి చేసిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు వినియోగించే ఎన్నికల సంఘం అధికారిక యాప్‌ను సైతం మజ్లిస్ నేతలకే అప్పగిస్తున్నారని బీజేపీ తన ఫిర్యాదులో పేర్కొంది. పాతబస్తీతో పాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, వరంగల్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చాలామంది ఓటర్లకు కనీసం దరఖాస్తు ఫారాలు కూడా అందలేదని వివరించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ సందర్భంగా పలు అంశాలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లింది. హైదరాబాద్‌లో కేవలం ఆంగ్ల భాషలో, జిల్లాల్లో తెలుగులో ఫారాలను పంపిణీ చేయడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడిన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఇంటింటి సర్వేను తప్పనిసరి చేయాలని, ఓటర్లు అందుబాటులో లేని పక్షంలో బీఎల్ఓలు కనీసం మూడుసార్లు వారి ఇళ్లను సందర్శించేలా ఆదేశాలు జారీ చేయాలని బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఓటర్ల జాబితా సవరణ కోసం జూన్ 25న ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ జూలై 24 వరకు కొనసాగనుంది. జూలై 31న ముసాయిదా జాబితాను, అక్టోబర్ 1న తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించనుంది.

# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్‌లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు

(మొదటి పేజీ తరువాయి)

వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల గురించి చర్చించారు. రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, మంత్రుల కమిటీ సిఫారసు మేరకు వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు. ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతి 25 టౌన్‌షిప్‌ల్లో ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాత్రిలోగా భూములివ్వనివారికి రేపు భూ సేకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ 2.5 ఎకరాలకు అమలు చేస్తున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వివరించారు. సమావేశం అనంతరం మీడియాకు మంత్రి నారాయణ వివరాలు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ ప్రక్రియను అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# కేరళ,గోవా తరహాలోనే బీచ్ షాక్స్

(మొదటి పేజీ తరువాయి)

పందిరిమామిడిలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా ఉద్యాన పరిశోధనా కేంద్రంలో ఏర్పాటు చేసిన తాటి ఉత్పత్తుల తయారీ పరిశ్రమను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ , గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుదిపూడి సత్తిబాబులతో కలిసి పరిశీలించడమైనది. నీరా, తాటి బెల్లం, తాటి పానకం రుచి చూసి, యూనివర్సిటీ సమీపంలోని తాటి తోటలను పరిశీలించాము. అధికారులతో మాట్లాడి నీరా పరిశ్రమ, ఉప ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకోవడమైనది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. బీచ్‌లలో ఎవరికీ ఇబ్బంది లేకుండా నిర్మానుష్య ప్రదేశాల్లో బీచ్ షాక్స్ ఉంటాయని తెలిపారు. బీచ్ సాక్స్‌పై ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టూరిజం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్లో మాత్రమే ఇదో భాగమన్నారు. అక్టోబర్ నుంచి కొత్త ఎక్సైజ్ విధానం అమల్లోకి తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. మద్యం అధిక ధరల అమ్మకాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తున్నారని అన్నారు. ఎమ్మార్పీకి మించి అమ్మితే మద్యం షాపులు సీజ్ చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఇకపోతే దేశాన్ని, హిందూ మతాన్ని అవమానించిన వారిని జగన్ వెనకేసు కొస్తున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్యానించారు. జగన్ హయాంలో బీసీలకు ద్రోహం చేశారని దుయ్యబట్టారు. 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించారని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో 1,608 మంది బీసీలు పదవులు కోల్పోయారని తెలిపారు. వైసీపీ నేతలు బీసీ రౌండ్‌టేబుల్ పేరుతో కుట్రలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహించారు. ఏపీకి పెట్టుబడులు రావడం జగన్‌కు ఇష్టం లేదని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో జరిగిన రూ.3500 కోట్ల లిక్కర్ స్కాం దేశంలోనే పెద్దదని సుప్రీంకోర్టు చెప్పిందని అన్నారు. పనికిరాని బ్రాండ్లతో వేలకోట్లు దోచుకున్నారని ÷ర్ అయ్యారు. నాసిరకం మద్యంతో వేలమందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. వైసీపీని అడ్రస్ లేకుండా చేస్తామని హెచ్చరించారు.

# ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతు న్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డి పాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన మోదీ..

## ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని



**న్యూ ఢిల్లీ, మన జనప్రగతి జూలై 07:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. జకార్తాలో మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇరు దేశాల మధ్య ఉన్న నాగరికత, చారిత్రక వారసత్వ సంబంధాలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ స్థిరత్వం కోసం ఉమ్మడిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. భారత్, ఇండోనేషియాలను సముద్రాలు వేరుచేయడం లేదని, చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలనే వారధులు రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరు దేశాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు, పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా ఎన్నికల వ్యవస్థ ఆధునికీకరణకు భారత్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) అభివృద్ధిలో తోడ్పాటునందిస్తామని, అదేవిధంగా ఇండోనేషియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భారత ప్రభుత్వ పథకాలను తమ దేశంలోనూ అమలు చేస్తామని గతంలో ఇండోనేషియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు" అని మోదీ చమత్కరించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణానికి ఈ వ్యాఖ్య అద్దం పట్టింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సహకారం అత్యంత కీలకమని ప్రధాని ఉద్ఘాటించారు. జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు.

# సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రా పుట్టినిల్లు

(మొదటి పేజీ తరువాయి)

అభినందించారు. రాష్ట్రంలో 2 లక్షల మందికిపైగా కళాకారులున్నారు. గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ హస్తకళా రంగానికి కొత్త దశను తీసుకొస్తాం. వదిలేసిన వస్త్రాలు కూడా వ్యర్థం కాకుండా వస్తువుల తయారీ చూస్తున్నాం. డబ్బు సంపాదనే కాదు.. పర్యావరణ పరిరక్షణ కూడా ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి. మారుమూల గ్రామంలోని కళాకారుడి కృషి.. ప్రపంచానికి చేరాలనేదే ప్రభుత్వ లక్ష్యం. వోకల్ ఫర్ లోకల్ మాత్రమే కాదు.. లోకల్ టు గ్లోబల్ లక్ష్యంగా పని చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఏపీ పుట్టినిల్లు అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఒక జాతి గొప్పతనం నిర్మించిన భవనాల్లో కాదని, కళాకారుల్లో కనిపిస్తుందని అభివర్ణించారు. కళాకారుల అద్భుత ప్రతిభను, వారి కష్టాన్ని గుర్తించడానికి తాను ఈ కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. హస్తకళాకారుల వస్తువుల తయారీ మాత్రమే కాకుండా, వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, రామాయణంలోని రావణ సంహార ఘట్టాన్ని తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన తీరును పవన్ కల్యాణ్ అభినందించారు. ప్రతి స్టాల్‌ను సందర్శించి, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులను వ్యక్తిగతంగా పవన్ కల్యాణ్ ప్రోత్సహించారు. కళాకారులతో కలిసిపోయి, వారి నైపుణ్యాలను ప్రశంసించారు. వారి విజయాలు, సవాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కళాకారుల కోరిక మేరకు, క్లస్టర్ల వారీగా గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. ఏపీ హస్తకళల అభివృద్ధికి తమ ప్రభుత్వం అవసరమైన మద్దతును అందిస్తోందని స్పష్టం చేశారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08 - 07 - 2026

# ఈ నెల మూడో శనివారం భారీగా మొక్కలు నాటాలి: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



**కర్నూలు మన జనప్రగతి జూలై 07:-** జిల్లా వ్యాప్తంగా ఈ నెల మూడో శనివారం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు 45 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో గ్రీన్ కవర్ 6 శాతం మాత్రమే ఉండగా, దానిని క్రమంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, సచివాలయాలు, పార్కులు, రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి ఒక మొక్క అందించి సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ముఖ్యంగా పండ్ల మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు.వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, నాటిన మొక్కల వివరాలను 'మేరీ లైఫ్' పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు నేల తేమ సంరక్షణ, మిశ్రమ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.సమావేశంలో డిఎఫ్ఓ శ్యామల, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, డి ఎం హెచ్ ఓ డా.భాస్కర్ రాజు, డి సి హెచ్ ఎస్ డా.జాఫ్రుల్లా, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, ఐసిడిఎస్ పిడి విజయ, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# ఎన్యూమరేషన్ ఫారం' కోసం సచివాలయాన్ని సంప్రదించండి

### - ఓటర్లకు కర్నూలు ఈఆర్వో చల్లా ఓబులేసు విజ్ఞప్తి



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 07:-** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారం ఇంకా అందని ఓటర్లు ఉంటే బుధవారం సమీప సచివాలయంలో సిబ్బందిని సంప్రదించి ఫారం పొందాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. మంగళవారం ఆయన చాకలి వీధి, కొత్తపేట రైతుబజార్ పరిసరాల్లోని 161, 163, 166 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా, అత్యంత ప్రాధాన్యంతో తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లకు బుధవారం సమీప సచివాలయంలో ఫారం పొందేలా ప్రత్యేక వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.అదేవిధంగా కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ https://voters.eci.gov.in/ ద్వారా కూడా ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూరించి సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లలో అవగాహన కల్పించేందుకు మంగళవారం నుంచి 10 ఆటోల ద్వారా మైక్ ప్రచారం ప్రారంభించినట్లు తెలిపారు.కార్యక్రమంలో సూపర్వైజర్ జి.ఎం. శ్రీకాంత్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు 100% పూర్తి చేయాలి: కలెక్టర్ డా. ఏ. సిరి



**కర్నూలు, మన జనప్రగతి, జూలై 07:-** జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను 100 శాతం పూర్తి చేసి విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర, నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్య సేవలు అందేలా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. వినియోగంలో లేని ఆర్ఓ ప్లాంట్లను వెంటనే ప్రారంభించాలని, తాగునీటి పైప్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లాలోని వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, లోపాలు ఉంటే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పారిశుధ్య పనులు, పార్కుల అభివృద్ధి, మొక్కల నాటకం, వర్షపు నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని, ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు.

# మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రముఖులకు సన్మానం



**శేరిలింగంపల్లి మన జనప్రగతి జూలై 07:-** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి మియాపూర్ న్యూ కాలనీ మార్కెట్ ఏర్పాటుకు సహకరించినందుకుగాను కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులు స్థానిక ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి ని ,రవికుమార్ యాదవ్ ని ఆహ్వానించి పేద ప్రజలకు అండగా నిలిచినందుకు వారి ఇరువురిని సన్మానించారు.మీరు ఏ ఒక్కరికి భయపడకుండా నిశ్చింతగా, నిర్భయంగా మీరు మార్కెట్ ను నిర్వహించుకోవచ్చునని దళారులకు, కబ్జా దారులకు భయపడే ప్రసక్తి లేదని, అవసరమైతే పార్లమెంటులో మాట్లాడి మోడల్ మార్కెట్ యార్డ్ కింద ఈ ల్యాండ్ ను సాంక్షన్ చేపిస్తానని ఎంపీ తెలిపారు.పేద ప్రజల తరఫున అధికారులతో చర్చించి మార్కెట్ నిర్వహించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అధికారికంగా పర్మిషన్స్ వచ్చే విధంగా చొరవ చూపిన స్థానిక ఎంపీ కి స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులకు రవి కుమార్ యాదవ్ మార్కెట్ కమిటీ సభ్యుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు ఖాజా బాషా, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మహేష్ యాదవ్, అడ్వకేట్ కిషోర్ యాదవ్,లక్ష్మణ్ ముదిరాజ్ ,గణేష్ ముదిరాజ్, పవన్ యాదవ్, నాగులు, పట్టాభిరామ్,శివ భాష, రాము మొదలవారు పాల్గొన్నారు

# రిజిస్ట్రేషన్ల ప్రైవేటీకరణతో లేఖర్ల కుటుంబాలు రోడ్డు పాలు ప్రజల ఆస్తులకు రక్షణ కరువు

### జీవో నెం.396 రద్దు చేయాలని కాకినాడలో దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్



**కాకినాడ మన జనప్రగతి జూలై 07:-** రిజిస్ట్రేషన్ వ్యవస్థను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్తోందని దస్తావేజు లేఖర్లు ఆరోపిస్తున్న జీవో నెం.396ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాకినాడ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించిన దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సిహెచ్. గోవిందరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే రిజిస్ట్రేషన్ల శాఖను ప్రైవేట్ సంస్థలు లేదా థర్డ్ పార్టీ ఏజెన్సీలకు అప్పగించే ప్రయత్నం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వ పర్యవేక్షణలో సాగుతున్న వ్యవస్థను ప్రైవేటీకరిస్తే వేలాది మంది దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.అంతేకాకుండా, ఈ నిర్ణయం వల్ల ముందుగా నష్టపోయేది సామాన్య ప్రజలేనని వారు వాదించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రైవేట్ సంస్థలు ప్రవేశిస్తే ప్రభుత్వ ఫీజులకు అదనంగా సేవా రుసుములు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని, దీంతో భూములు, ఇళ్లు కొనుగోలు చేసే మధ్యతరగతి, పేద ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.దస్తావేజు లేఖర్ల అభిప్రాయం ప్రకారం, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజల ఆస్తులకు సంబంధించిన అత్యంత కీలకమైన సమాచారం, కుటుంబ వారసత్వ వివరాలు, గుర్తింపు పత్రాలు, భూముల రికార్డులు వంటి సున్నితమైన డేటా ఉంటుంది. ఇటువంటి సమాచారాన్ని ప్రైవేట్ సంస్థలు నిర్వహించే పరిస్థితి ఏర్పడితే డేటా భద్రత, గోప్యతపై అనేక సందేహాలు తలెత్తే అవకాశముందని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో డేటా లీకులు, దుర్వినియోగం లేదా మోసాలకు అవకాశం కలిగితే ప్రజల ఆస్తుల రక్షణే ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ వ్యవస్థలో అధికారులు చట్టపరమైన బాధ్యతలతో పనిచేస్తారని, అదే ప్రైవేట్ సంస్థల విషయంలో జవాబుదారీతనం, పర్యవేక్షణ, బాధ్యతలపై స్పష్టత అవసరమని సంఘం నాయకులు అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏవైనా లోపాలు జరిగినప్పుడు బాధ్యత ఎవరిది, నష్టపోయిన ప్రజలకు పరిహారం ఎలా లభిస్తుందనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం జీవో నెం.396ను ఉపసంహరించుకోకపోతే జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల బంద్ నిర్వహించడంతో పాటు నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి.జె. ప్రసాద్, సిహెచ్. గోవిందు, పారుపూడి ప్రసాదరావు, ధూళిపూడి సతీష్, జాడ అప్పలరాజు యాదవ్, గేసాల శీను, బి.వి.వి. సత్తిబాబు, డీకే మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణకై సంతకాలు సేకరణ: సిపిఎం



**పత్తికొండ మన జనప్రగతి జులై 07:-** నియోజకవర్గంలో ఏ పార్టీ అధికారం చేపట్టిన వాగ్దానాలకే పరిమితం. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డిరోడ్డు విస్తరణ లో నష్టపోయే వారికి ప్రభుత్వం సరైన నష్టపరిహారం చెల్లిస్తే విస్తరణ ఎప్పుడో జరిగేది. సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్రకొందరి ప్రయోజనాల కోసం విస్తరణ ఆగిపోయింది. సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి పత్తికొండలో రోడ్డు విస్తరణ జరిగేంతవరకు ఉద్యమ ఆగదు రైతు సంఘం కార్యదర్శి సిద్దయ్య గౌడ్ చుట్టుపక్కల అన్ని నియోజకవర్గాల్లో విస్తరణ జరిగింది పత్తికొండలో మాత్రమే ఎందుకు జరగడం లేదు వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బుజ్జులురోడ్డు విస్తరణకై సంతకాల సేకరణ మంగళవారం నాలుగు స్తంభాల కూడలి దగ్గర సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి,సిఐటియు కార్యదర్శి ఎం రవిచంద్ర, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, దస్తగిరి, సిఐటియు అధ్యక్షులు గోపాల్, రైతు సంఘం కార్యదర్శి సిద్దయ్య గౌడ్ఉపాధ్యక్షులు మధురాజుల కారప్పవ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు బుజ్జులుశికామణిపట్టణ కార్యదర్శి నరసన్న, రజక సంఘం నాయకులు ఈరన్న, పాల్గొని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ పార్టీ అధికారం చేపట్టిన వాగ్దానాలకే పరిమితమయ్యారని రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని నేటికి చేపట్టాక పోవడం ఎంతో విడ్డూరంగా ఉందని ప్రాణాలు కోల్పోతున్న అటు నాయకులు ఇటు అధికారులు ఎలాంటి స్పందన లేకుండా ఉండడం పత్తికొండ ప్రజలకు శాపంగా మారిందన్నారుకోర్టులో కేసు వేశారన్న నెపంతో నేటికీ విస్తరణ పై ఎలాంటి స్పందన లేకపోవడం కోర్టులో కేసు వేసిన వారు ఎందుకు వేశారు అన్నది ఎవరికీ వివరించకపోవడం విడ్డూరంగా ఉందని విస్తరణలో నష్టపోయిన వారికి సరియైన నష్టపరిహారం చెల్లిస్తే ఎప్పుడో ఈ రోడ్డు విస్తరణ జరిగి ఉండేదని అలా కాకుండా నష్టపరిహారంలో సరియైన వివరణ ఇవ్వకపోగా అరకొర నష్టపరిహారాన్ని చూపడంతో విస్తరణ కార్యక్రమాలు జరగకపోవడానికి కూడా ప్రధాన కారణమనివారుఅన్నారు.కొందరి ప్రయోజనాల కోసం విస్తరణ కార్యక్రమాన్ని ఆపడం పత్తికొండ ప్రజలకుశాపంగా మారిందన్నారు.పత్తికొండ పట్టణంలో రోడ్డు విస్తరణ కార్యక్రమం నిర్వహించి రోడ్డు విస్తరణ చేపట్టే అంతవరకు ఉద్యమం ఆగదని వారుఅన్నారు పత్తికొండచుట్టుపక్కల నియోజకవర్గాల్లో రోడ్డువిస్తరణకార్యక్రమాలు జరుగుతుంటే పత్తికొండ పట్టణంలో రోడ్డు మరణాలు జరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్న నేటికీ విస్తరణ పై ఎలాంటికార్యచరణరూపొందించకపోవడం అర్థం కావడం లేదని ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు అధికారులు నాయకులు పనిచేయాలి తప్ప ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్న ప్రధాన అంశం రోడ్డు విస్తరణని దీన్ని ఎందుకు మరిచారు వారికే తెలియాలని వెంటనే రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ఈ రోడ్డు విస్తరణ కార్యక్రమం జరగాలని చేపట్టిన సంతకాల సేకరణ దాదాపుగా వెయ్యి మంది సంతకాలతో వారి మద్దతును తెలియపరిచారని ఇక ఈ కార్యక్రమాన్ని ఉదృతం చేస్తామన్నారు అమాలి కార్మిక సంఘం నాయకులు చంద్ర ఎస్ఎఫ్ఐ నాయకులు సుధాకర్ రమేష్ అంజి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్‌డీటీ ఆధ్వర్యంలో ఎంపీపీ పాఠశాలకు జిరాక్స్ యంత్రం అందజేత

**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 07:-** మండల పరిధిలో గోవిందవాడ గ్రామంలోని ఆర్‌డీటీ కాలనీ ఎంపీపీ పాఠశాలకు విద్యార్థుల విద్యా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.21,500 విలువైన జిరాక్స్ యంత్రాన్ని ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు,ఈ జిరాక్స్ యంత్రాన్ని జీఎస్ఎన్ నిధులతో గ్రామ ప్రజల సహకారంతో పాఠశాలకు అందించారు,ఈ సందర్భంగా పాఠశాలకు జిరాక్స్ యంత్రం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన పాఠ్యపత్రాలు,పరీక్షా ప్రశ్నాపత్రాలు తదితర విద్యా సంబంధిత పనులు సులభంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు,ఈ కార్యక్రమంలో ఆర్‌డీటీ సంస్థ ప్రతినిధులు ఏటీఎల్ వెంకటేశులు,సీఓ గోవింద్ నాయక్,ప్రదానోపాధ్యాయుడు రాజ్‌కుమార్,ఉపాధ్యాయుడు. దాసునాయక్ గ్రామ ప్రజలు,సీడీసీ సభ్యులు పాల్గొన్నారు,గ్రామ ప్రజలు ఆర్‌డీటీ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పోరుమామిళ్ల పంచాయితీకి రెగ్యులర్ కార్యదర్శి



**పోరుమామిళ్ల, మన జనప్రగతి జులై07:-** పోరుమామిళ్ల మేజర్ పంచాయితీ రెగ్యులర్ కార్యదర్శిగా యస్వంత్ కుమార్ భాద్యతలు స్వీకరించడం జరిగింది. ఈయన నంద్యాల డిపిఆర్సీ నుండి రావడం జరిగింది. ఈ సందర్భంగా కొత్త కార్యదర్శి యస్వంత్ కుమార్ మాట్లాడుతూ...ముఖ్యంగా శానిటేషన్ మీద ప్రత్యేక ద్రుష్టి సారిస్తామని పంచాయితీని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. విలేకరులు, ప్రజలు సహకరించాలన్నారు.

# పంటల బీమా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప అర్బన్ మన జనప్రగతి జూలై 07:-** ఖరీఫ్2026, రబీ2026-27 పంటల సీజన్లకు అమలు చేస్తున్న పంటల బీమా పథకాలను జిల్లాలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటన కోరారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఇతర అనుకోని కారణాల వల్ల పంటలకు కలిగే నష్టాల నుంచి రైతులకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం పంటల బీమా పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.జిల్లాలో అర్హులైన రైతులు తమ ఆధార్, భూ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, సాగు వివరాలతో సమీపంలోని గ్రామ, వార్డు సేవా కేంద్రాలు లేదా వ్యవసాయ శాఖ కార్యాలయాలను సంప్రదించి నిర్ణీత గడువులోగా బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు అనంతరం ఇచ్చే రసీదును తప్పనిసరిగా భద్రపరచుకోవాలని తెలిపారు.ఖరీఫ్2026 ఆహార పంటలకు ఈ ఏడాది ఆగస్టు 15 వరకు, వాణిజ్య, ఉద్యాన పంటలకు ఆగస్టు 31 వరకు బీమా నమోదు అవకాశం ఉందన్నారు. అలాగే రబీ2026-27 ఆహార పంటలకు డిసెంబర్ 15 వరకు, ఇతర పంటలకు డిసెంబర్ 31 వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.ప్రతి పంటకు సంబంధించిన బీమా మొత్తం, రైతు చెల్లించాల్సిన ప్రీమియం, ప్రభుత్వ రాయితీ తదితర వివరాలు వ్యవసాయ శాఖ కార్యాలయాలు, గ్రామ, వార్డు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.పంటలకు బీమా చేయించుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే ఆర్థిక నష్టాలను కొంత మేర అధిగమించే అవకాశం ఉంటుందని, జిల్లాలోని ప్రతి అర్హ రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నిర్ణీత గడువులోగా పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు పిలుపునిచ్చారు.

## పగిలిన తాగునీటి పైపుతో నీరు వృథా

### - మరమ్మతులకు స్థానికుల విజ్ఞప్తి



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 07:-** మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధి ఆలీనగర్‌లో తాగునీటి పైపు పగిలిపోవడంతో గత రెండు రోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ నంబర్-8 ఎదురుగా ఉన్న ప్రాంతంలో పైపు పగిలిపోవడంతో విలువైన తాగునీరు వృథాగా పోవడంతో పాటు వీధంతా జలమయమైందని తెలిపారు. మరోవైపు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పైపును మరమ్మతు చేసి తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్యను వివరణ కోరగా, పైపు పగిలిన విషయం తమ దృష్టికి వచ్చిందని, రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## ఆశా డే సందర్భంగా డెంగ్యూపై అవగాహన కార్యక్రమం



**సిద్ధవటం, మన జనప్రగతి జూలై 07:-** ఆశా డే సందర్భంగా సిద్ధవటం మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో మంగళవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ, జూలై 1 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం, నీటి తొట్లలో పాత నీటిని తొలగించి కొత్త నీటిని నింపడం, ప్లాస్టిక్ గ్లాసులు, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి బోండాలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని నివారించవచ్చని తెలిపారు. జ్వరం, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు స్వీయ వైద్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా వర్కర్లు ప్రజలకు డెంగ్యూ నివారణ చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీమోహన్, సీహెచ్ఓ లక్ష్మీనరసింహ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, సూపర్వైజర్లు శారదాదేవి, మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం: సీఐటీయూ



**కలకడ,మన జనప్రగతి జూలై 07:-** ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించే రాష్ట్రవ్యాప్త ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ అన్నమయ్య జిల్లా నాయకులు మండెం సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. ఆశా డే సందర్భంగా కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలను కలిసి వారి డిమాండ్లపై అవగాహన కల్పించారు. గ్రామీణ ఆరోగ్య సేవల్లో ఆశా కార్యకర్తల సేవలు కీలకమని, కరోనా సమయంలోనూ వారు విశేష సేవలందించారని కొనియాడారు. ఆశా కార్యకర్తలకు నెలకు రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ, ప్రమాద బీమా, పెండింగ్ ప్రోత్సాహకాలు తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలకడ మండలానికి చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు రచయిత్రుల మహాసభలకు ఆహ్వానం




**పలమనేరు మన జనప్రగతి జూలై 07:-** ఈనెల 11, 12 తేదీలలో విజయవాడలో జరగనున్న ప్రపంచ తెలుగు రచయిత్రుల మహాసభలలో పాల్గొనాల్సిందిగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్పకు ఆహ్వానం అందింది. బాల సాహిత్య సదస్సు మరియు సాహితీ సంస్థల ప్రతినిధుల సదస్సులలో పాల్గొని ప్రసంగించాల్సిందిగా నిర్వాహకులు ఆహ్వానించారు. అదేవిధంగా పలమనేరు కు చెందిన డాక్టర్ రజనీని మహాసభలలో భాగంగా కూచిపూడి నృత్యం ప్రదర్శించాల్సిందిగా ఆహ్వానించినట్టు తెలిపారు.

## సమన్వయ సహకారాలతో.. ముందుకెలదాం

### ● సమాచార పౌర సంబంధాల శాఖ జోన్ -4 నూతన ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్



**కడప మన జనప్రగతి జూలై 07:-** రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారాలు, సమాచారశాఖ, మీడియా సమిష్టి కృషితో.. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరవేసేందుకు పాటుపడదాం అని ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ కోరారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ఆర్జేడీ కార్యాలయంలో.. జిల్లాలోని మీడియా స్టాఫర్లు, సిబ్బందితో ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ ఆర్ కడప జిల్లాలో జోన్-4 కార్యాలయంలో ఆర్జెడీగా విధులు నిర్వర్తించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. జోన్-4 పరిధిలోని జిల్లాల్లో సమాచార శాఖ, మీడియా పబ్లికేషన్స్, ప్రసారాల ద్వారా విస్తృతమైన సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఈ జిల్లాల్లో అక్షరాస్యత, పేదరిక నిర్మూలన, వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల కార్యక్రమాలను, సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో మీడియా పాత్ర చాలా కీలకమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో మీడియా ప్రతినిధులు కర్తవ్య నిబద్ధతతో, పారదర్శకంగా వృత్తి ధర్మాన్ని నెరవేర్చాలన్నారు. సమాచార శాఖను పటిష్టం చేయడంతో పాటు.. జోన్-4 పరిధిలోని జిల్లాల్లో పాత్రికేయులకు వృత్తి పరంగా సహాయసహకారాలు అందించడంలో ఎల్లపుడు ముందుంటామన్నారు. సమాచార శాఖ, పాత్రికేయుల మధ్య సత్సంబంధాలు కొనసాగినప్పుడే... ప్రభుత్వ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందగలవని, అందుకోసం అందరం సమిష్టిగా కృషి చేయాలని మీడియా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. అనంతరం పలువురు పాత్రికేయులు, సిబ్బంది ఆర్జేడీ కి పుష్ప గుచ్చాలు అందజేసి.. దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, సమాచార శాఖ ఎడి కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి రిత్విక కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం: అండగా ఉంటామని భరోసా



**లింగాల మన జనప్రగతి జూలై 07:-** మండలం లోపట్నుతల గ్రామానికి చెందిన చిన్నారి రిత్విక హత్య ఘటనతో తీవ్ర మనోవేదనకు గురైన తండ్రి రామాచారి అస్వస్థతకు గురై పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వి.బి. భాస్కర్ బాబు, స్వర్ణకార కార్మికులు, వర్తకులు ఆసుపత్రికి వెళ్లి రామాచారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.50,000 విలువైన చెక్కును ఆర్థిక సాయంగా అందజేశారు. వి.బి. భాస్కర్ బాబు మాట్లాడుతూ, చిన్నారి రిత్విక మృతిని జీర్ణించుకోలేక రామాచారి ఆరోగ్యం దెబ్బతినడం బాధాకరమన్నారు. ఈ కేసులో నిందితురాలికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా న్యాయపోరాటం కొనసాగిస్తామని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పులివెందుల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నూరుల్లా మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా బాధిత కుటుంబానికి అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. పులివెందుల నియోజకవర్గం సీనియర్ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు సనత్ కుమార్ ఆచారి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులంతా బాధిత కుటుంబానికి అండగా ఉంటారని తెలిపారు. అనంతపురం జిల్లా స్వర్ణకార కార్మిక వర్తక సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి ముష్టూర్ శ్రీనివాస్ ఆచారి మాట్లాడుతూ, తమ సంఘం తరఫున కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. పులివెందుల స్వర్ణకార సంఘం నాయకులు ప్రకాష్ ఆచారి, బొల్లు రవి, అమానుల్లా, కృష్ణమాచారి, షబ్బీర్, ఈశ్వరయ్య, ఖాదర్, మహేష్ ఆచారి, లోకేష్ ఆచారి, షాకీర్ తదితరులు, స్వర్ణకార కార్మికులు, వర్తకులు మరియు సంఘ నాయకులు పాల్గొన్నారు.

## వేంపల్లి స్మార్ట్ కిచెన్ నిర్మాణాన్ని మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన తులసిరెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జులై 07:-** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మాణ దశలో ఉన్న వేంపల్లి స్మార్ట్ కిచెన్ ను, ప్రస్తుతం అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ,పౌష్టికాహార పథకం అన్నారు. 1995 ఆగస్టు 15వ తేదీన ఆనాటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరిస్తాయన్నారు. బాల బాలికలను ఆకలి బారి నుండి కాపాడాలని,,వారికి పౌష్టికాహారం అందించాలని, పాఠశాలల్లో డ్రాప్ఔట్స్ తగ్గించాలని, హాజరు శాతాన్ని పెంచాలన్న లక్ష్యాలతో ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకం ప్రారంభమైన తర్వాత డ్రాప్ ఔట్స్ చాలా మటుకు తగ్గాయని,హాజరు శాతం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో మండలానికి ఒక స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేయాలని, అక్కడ నుండి అన్ని పాఠశాలకు ఆహారం సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు . ఈ నేపథ్యంలో వేంపల్లి మండలానికి సంబంధించి స్మార్ట్ కిచెన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ భవనాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించడం జరిగింది . ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వెంకట్రామిరెడ్డి,స్టాలిన్, హెడ్మాస్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి ధర్మారెడ్డి, జూనియర్ ఇంజనీర్ శ్రీనివాసులు,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ,చిన్నకోట్ల నాగరాజు, వేమయ్య పాల్గొన్నారు.

## నేటి నుంచి పీఎం విశ్వకర్మ రుణ అవుట్‌రీచ్ శిబిరాలు

**కడప,టౌన్ మన జనప్రగతి జూలై 07:-** వైఎస్ఆర్ కడప జిల్లాలో ప్రధాన్ మంత్రి విశ్వకర్మ పథకం కింద గతంలో తిరస్కరణకు గురైన రుణ దరఖాస్తులను పునఃపరిశీలించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు జూలై 8 నుంచి 18 వరకు ప్రత్యేక రుణ అవుట్‌రీచ్ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) జి. జనార్దనం తెలిపారు. భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఈ అభివృద్ధి మరియు సౌకర్యాల కార్యాలయం, విశాఖపట్నం ఆధ్వర్యంలో జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం సహకారంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ వృత్తిదారులు, కళాకారులకు సకాలంలో బ్యాంకు రుణాలు అందించి స్వయం ఉపాధిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు నిర్వహించబడతాయని తెలిపారు. జూలై 8న బద్వేలు ఎంపీడీవో కార్యాలయంలో, 9న సిద్దవటం ఎంపీడీవో కార్యాలయంలో, 10న పులివెందుల ఎంపీడీవో కార్యాలయంలో, 14న జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయంలో, 16న ప్రొద్దుటూరు ఎంపీడీవో కార్యాలయంలో, 18న కడప జిల్లా పరిశ్రమల కేంద్రంలో శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శిబిరాలకు హాజరయ్యే పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ ఫోన్, పాన్ కార్డు (ఉన్నవారు), పీఎం విశ్వకర్మ ప్రాథమిక శిక్షణ పూర్తి చేసిన ధ్రువీకరణ పత్రం, దరఖాస్తులో పేర్కొన్న బ్యాంకు ఖాతా పాస్‌బుక్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. వైఎస్ఆర్ కడప జిల్లాలోని అర్హులైన సంప్రదాయ వృత్తిదారులు, కళాకారులు తమకు సమీపంలోని శిబిరానికి నిర్ణీత తేదీన హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్డిఎం విజ్ఞప్తి చేశారు.

## పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



**కడప అర్బన్ మన జనప్రగతి జులై 07:-** నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు. మంగళవారం నగరంలోని జిల్లా పోలీస్ సంక్షేమ ఆస్పత్రిలో కడప నగరానికి చెందిన ఏషియన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ ఏషియన్ హాస్పిటల్స్ కు చెందిన అనుభవజ్ఞులైన వైద్యులు తమ వంతు సామాజిక బాధ్యతగా పోలీస్ సిబ్బంది కి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం తమకు అత్యంత ప్రాధాన్యత అని, వారు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని ఎస్పీ గారు అన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు వంటివి ముందుగానే గుర్తించవచ్చని, ఇది సకాలంలో చికిత్స అందించడానికి, సమస్యలు తీవ్రతరం కాకుండా నిరోధించడానికి సహాయపడుతుందన్నారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబాలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ వంతు సామాజిక బాధ్యతగా పోలీస్ సిబ్బంది కి వైద్య సేవలందించే అవకాశం కల్పించినందుకు హాస్పిటల్ వైద్యులు జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ కి ధన్యవాదాలు తెలిపారు. ఇందులో కాలేయ సమస్యలకు సంబందించిన ఖరీదైన ఫైబ్రో స్కాన్ పరీక్షను ఉచితంగా అందచేయడంతో పాటు ఎండోస్కోపీ, వైరల్ మార్కర్ టెస్ట్, హెపటైటిస్- బి వ్యాక్సిన్ లను అతి తక్కువ ధరకు పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు అందచేశారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. డా. ఆర్. క్రాంతి కిరణ్ ( జనరల్ మెడిసిన్ ), డా. హిమబిందు ( గైనకాలజిస్ట్) వైద్య శిబిరం లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి (అడ్మిన్)కె.ప్రకాష్ బాబు గారు, ఎ.ఆర్ అదనపు ఎస్.పి బి.రమణయ్య, ఎ.ఆర్ డి.ఎస్.పి నాగేశ్వర రావు, పోలీస్ యూనిట్ డాక్టర్ డా.రేష్మ, ఆర్.ఐ టైటస్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఏషియన్ హాస్పిటల్ టెక్నీషియన్ లు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామచంద్రపురం సమస్యలపై జోనల్ కమిషనర్‌కు మాజీ కార్పొరేటర్ ఫిర్యాదు



**పటాన్ చెరువు మన జనప్రగతి జూలై 07:-** సీఎంసీ కమిషనర్ శ్రీజనను కలిసిన అనంతరం, రామచంద్రపురం డివిజన్‌కు సంబంధించిన పలు సమస్యలను జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించడంతో, రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రపురం డివిజన్‌లోని పలు కాలనీలలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర సమస్యలను వివరంగా తెలియజేశారు. సమస్యల తీవ్రతను విన్న జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన పూర్తి చేసి సమర్పించాలని సూచించారు. అవసరమైన నిధుల మంజూరు విషయంలో కూడా కమిషనర్‌తో చర్చించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు బూరుగడ్డ పుష్పనగేష్ తెలిపారు. రామచంద్రపురం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న బూరుగడ్డ పుష్పనగేష్ చర్యలను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ప్రతి కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా కోరారు.

## అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి.. ఎస్పీ ఆదేశంతో 1 లక్ష తక్షణ సాయం... అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

**అన్నమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జులై 07:-** టి.సుండుపల్లి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ 2671 గండి వెంకటేశ్వర్లు (46) అనారోగ్యంతో మరణించడం పట్ల జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తీవ్ర సంతాపం తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు మృతుని ఇంటికి వెళ్లి, దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం 1 లక్ష నగదు సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. రాయచోటి మండలం రెడ్డివారిపల్లి గ్రామంలో పోలీసు అధికారులు, బంధువులు, గ్రామస్థుల కన్నీటి వీడ్కోలు మధ్య, ఏఆర్ పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం చేశారు. అధికార లాంచనాలతో అంత్యక్రియలు ముగిశాయి.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08 - 07 - 2026

## ఎస్సీ, ఎస్టీ రైతులకు 7 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు: విద్యుత్ శాఖ ఏఈ అరుణ్ కుమార్



**కలకడ మన జనప్రగతి జూలై 07:-** కలకడ మండలంలోని ఎస్సీ, ఎస్టీ రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు మొత్తం ఏడు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసినట్లు కలకడ విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ (ఏఈ) అరుణ్ కుమార్ తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ద్వారా వ్యవసాయ పంపుసెట్లకు తగిన వోల్టేజ్‌తో విద్యుత్ అందడంతో పాటు, ఓవర్‌లోడ్ సమస్యలు తగ్గి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లలో గుడిబండ గ్రామానికి రెండు, రాతికుంటపల్లికి ఒకటి, పాపిరెడ్డిగారిపల్లికి ఒకటి, కదిరిచెరువుకు ఒకటి, ఎనుకొండపాలెంకు ఒకటి, కలకడ కొత్తపల్లికి ఒకటి చొప్పున కేటాయించినట్లు వివరించారు.ఈ సందర్భంగా ఏఈ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ రైతులు సాగునీటి కోసం విద్యుత్‌పై ఆధారపడుతున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లతో వోల్టేజ్ సమస్యలు తగ్గి, మోటార్లు సక్రమంగా పనిచేయడంతో పంటలకు సకాలంలో నీరు అందే అవకాశం ఉంటుందని చెప్పారు.రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే విద్యుత్ శాఖ ప్రధాన లక్ష్యమని, విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సంప్రదించాలని ఏఈ అరుణ్ కుమార్ తెలిపారు.

## బంగారు పతకాలు సాధించిన ఎన్‌సీసీ విద్యార్థులు



**చిట్వేలి మన జనప్రగతి జులై 07:-** చిట్వేలి లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ -1 శిబిరంలో అసాధారణ ప్రతిభ కనబరిచి బంగారు, రజత పతకాలు సాధించి పాఠశాలకు విశేష గౌరవాన్ని తీసుకువచ్చారు. గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో జూన్ 24 నుండి జూలై 5 వరకు 12 రోజులపాటు నిర్వహించిన ఈ జాతీయ స్థాయి శిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ శిబిరంలో భారతదేశ వైవిధ్యభరిత సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు జాతీయ సమైక్యత, సోదరభావం, పరస్పర గౌరవం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, జాతీయ సమగ్రత వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించారని తెలిపారు. దేశ సమైక్యతను ప్రతిబింబించే ఈ శిబిరంలో నిర్వహించిన క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, చిత్రలేఖనం, సమూహ కార్యకలాపాలు తదితర విభాగాల్లో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. అవుల రమ్య, కొండప్పగారి దీక్ష, పిట్ట భరత్ బంగారు పతకాలు, సాయి సుజిత్ రెడ్డి రెండు రజత పతకాలు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ శిబిరంలో మరో ఇద్దరు క్యాడెట్లు జయప్రకాష్ ,లక్ష్మయ్య లు పాల్గొన్నారు. ఈ విజయంపై ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ హర్షం వ్యక్తం చేస్తూ, క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర సాధన, జాతీయ సమైక్యత పట్ల ఉన్న నిబద్ధతే విద్యార్థులను ఈ స్థాయికి చేర్చిందని అన్నారు. ఎన్సిసి క్యాడెట్లకు సాధించిన పథకాలు, ధృవపత్రాలు, ప్రత్యేక ఈబిఎస్‌బి క్యాప్ లు , బ్యాడ్జెస్ ను అందించారు.

## ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి: డీవైఎఫ్ఐ డిమాండ్




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 07:-** ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఫిట్‌నెస్ లేని బస్సులను వెంటనే సీజ్ చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మేరీ కుమార్, కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్త్రీ శక్తి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ఈ మేరకు మాట్లాడారు. పట్టణంలో వందల సంఖ్యలో ప్రైవేటు స్కూల్, కాలేజీ బస్సులు తిరుగుతున్నప్పటికీ, వాటికి అవసరమైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశంపై సందేహాలు ఉన్నాయని తెలిపారు. రవాణా శాఖ అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.కొన్ని విద్యాసంస్థలు పాత బస్సులకు రంగులు వేసి నడుపుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్సు డ్రైవర్లు అనుభవం కలిగి ఉండడంతో పాటు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, అవసరమైన రికార్డులు కలిగి ఉండాలని, ప్రతి బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. అయితే అనేక బస్సుల్లో ఈ నిబంధనలు అమలు కావడం లేదని విమర్శించారు. తక్కువ వేతనాలతో వయోవృద్ధులను డ్రైవర్లుగా నియమిస్తున్నారని, ఇటీవల పులివెందులలో స్కూల్ బస్సు చక్రాలు ఊడిపోయిన ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. అదృష్టవశాత్తూ ప్రమాదం జరగలేదని, ఒకవేళ ప్రమాదం జరిగి ఉంటే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. గతంలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరులో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు.అందువల్ల రవాణా శాఖ అధికారులు విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్, రికార్డులు, డ్రైవర్ల అర్హతలు తదితర అంశాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న బస్సులను సీజ్ చేసి సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది.

## ఏపి రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మణి ఎన్నిక



**చిట్వేలి మన జనప్రగతి జూలై 07:-** ఏలూరు జిల్లాలో జూలై 3, 4, 5 తేదీల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి ఈ మహాసభల సందర్భంగా చిట్వేలి ప్రాంతానికి చెందిన పందికాళ్ళ మణి ని రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పందికాళ్ళ మణి తెలిపారు. చిట్వేలి లో మణి మాట్లాడుతూ జిల్లాలో వరి, వేరుశనగ తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పండ్ల తోటలకు పేరుగాంచిన రైల్వే కోడూరు ప్రాంతంలో బొప్పాయి, మామిడి, అరటి పంటలు ఎక్కువగా పండిస్తారని గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని అన్నారు. ఈ సంవత్సరం ధరలు లేక తోతాపురి రకం కాయలను తోటలోనే చెట్లకు వదిలేయడం చాలా బాధాకరమని అన్నారుప్రభుత్వ స్పందించి పండ్ల తోటలకు గిట్టుబాటు ధర, హార్టికల్చర్ హబ్ గా మార్చి కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీకి, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## చవటపల్లి రవీంద్రనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**లక్కిరెడ్డిపల్లి, మన జనప్రగతి జూలై 07:-** లక్కిరెడ్డిపల్లి మండలంలోని అనంతపురం గ్రామపంచాయతీ పరిధిలోని చవటపల్లి రవీంద్రనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇటీవల నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న సేవలు, హాజరు నమోదు, పోషకాహార పంపిణీ, మెనూ అమలు, రక్తహీనత (అనీమియా), తక్కువ బరువు ఉన్న చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారంతో పాటు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలని, కేంద్రంలో ఎల్లప్పుడూ పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. చిన్నారుల ఆరోగ్య స్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అనీమియా మరియు పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ క్రాంతి కుమార్, ఎంపీడీవో రెడ్డయ్య, ఆర్ ఐ రాజేష్ సంబంధిత అధికారులు, అంగన్వాడి సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారానికి చమర్తికి ఆహ్వానం

### - 9న సిద్ధవటంలో తమ్మిశెట్టి శ్రీలేఖ ప్రమాణ స్వీకారం



**సిద్ధవటం, మన జనప్రగతి జూలై 07:-** సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన తమ్మిశెట్టి శ్రీలేఖ జూలై 9 గురువారం నాడు నిర్వహించనున్న ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజును మంగళవారం ఆహ్వానించారు. రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ సూచన మేరకు రాజంపేటలోని జగన్మోహన్ రాజు గెస్ట్ హౌస్‌లో ఆయనను కలిసిన జనసేన నాయకుడు, చైర్‌పర్సన్ భర్త దేరంగుల శ్రీకాంత్ శాలువాతో సత్కరించి, పూలమాల వేసి, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇస్తోందన్నారు. జూలై 9న సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా (బాబీ), రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, పేరూరు కొండయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఎన్ రామచంద్రా రెడ్డి ఆకస్మిక తనిఖీ




**చెన్నూరు, మన జనప్రగతి జూలై 07:-** కడప జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో ఎన్ రామచంద్రారెడ్డి మంగళవారం చెన్నూరు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులు, అభివృద్ధి కార్యక్రమాల రికార్డులు పరిశీలించారు. జనరల్ ఫండ్ ఖాతాలు, 15వ ఆర్థిక సంఘం ఎఫ్ ఎఫ్ సి గ్రాంట్‌కు సంబంధించిన రికార్డులు, స్వచ్ఛ రథం నిర్వహణకు సంబంధించిన లాగ్‌బుక్, సిబ్బంది హాజరు రిజిస్టర్, నగదు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు, కార్యాలయ నిర్వహణ రికార్డులు తదితర పత్రాలను పరిశీలించారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనుల్లో సీసీ రోడ్లు డ్రైనేజీలు వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించి రికార్డులు తెప్పించుకొని పరిశీలించారు, అలాగే మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, కార్యాలయ నిర్వహణలో తప్పులు జరిగితే క్షమించేది లేదన్నారు నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి కిరణ్ మోహన్ రావు ఏఈలు పాల్గొన్నారు, స్వచ్ఛ రథం నిర్వహణ, ఇంధన వినియోగం, వాహన నిర్వహణ వివరాలు, లాగ్‌బుక్ నమోదు తదితర అంశాలను పరిశీలించి నిబంధనల మేరకు అన్ని నమోదులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు అందించే సేవల్లో జాప్యం లేకుండా స్పందించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో నాణ్యత, పారదర్శకత మరియు జవాబుదారీతనంతో పనిచేయాలని పేర్కొన్నారు.

## వాక్సినేషన్ విధి విధానాల్లో ఆశా వర్కర్ల ఎంతో అవసరం

### ● ఆశా డే డెంగు వ్యతిరేక మాస సమావేశంలో జిల్లా ఈ మీ నైజేషన్ సి హెచ్ ఓ ముని రెడ్డి

**చెన్నూరు ,మన జనప్రగతి, జులై 07:-** చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే డెంగ్యూ వ్యతిరేక మాస సమావేశాన్ని నిర్వహించారు వ్యాక్సినేషన్‌ఆశ అజెండాలో భాగంగా వ్యాక్సినేషన్ రీ ఓరియంటేషన్ ట్రైనింగ్ జరిగినది ఓరియంటల్ ట్రైనింగ్ నందు డిస్టిక్ ఇమినైజేష సిహెచ్‌ఓ ముని రెడ్డి శిక్షణ ఇవ్వడం జరిగినది, ఈ కార్యక్రమంలో వ్యాక్సిన్ యొక్క ప్రాముఖ్యత మరియు గోల్డ్ చైన్ సిస్టం గురించి వ్యాక్సినేషన్ వల్ల కలుగు లాభాలు గురించి తెలియ చేశారు ,ఆశా డే మీటింగ్ లో భాగంగా మలేరియాసబ్ యూనిట్ ఆఫీసర్ మురళీధర్ కూడా పాల్గొని డెంగ్యూ వ్యతిరేక మాస సందర్భంగా మలేరియా డెంగు చికెన్ వ్యాధుల గురించి తెలియజేయడం జరిగింది ,ఈ డాక్టర్ వినయకుమార్ రెడ్డి సిహెచ్‌ఓ రెడ్డి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మురళీధర్ హెచ్ ఇ లక్ష్మీదేవి హెల్త్ సూపర్వైజర్ సుబ్బరామయ్య హెల్త్ అసిస్టెంట్లు ఆశా వర్కర్లు సిబ్బంది కార్యకర్తలు పాల్గొనడం జరిగింది మీటింగ్ అనంతరం డెంగ్యూ వ్యతిరేక మాస సందర్భంగా ర్యాలీ మరియు ప్రతిజ్ఞ చేయడం జరిగింది ఈ డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి సబ్ యూనిట్ ఆఫీసర్ మురళీధర్ హెచ్ ఇ లక్ష్మీదేవి హెల్త్ సూపర్వైజర్ సుబ్బరామయ ఆశ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది ఓరియంటేషన్ ట్రైనింగ్ జరిగినది ఓరియంటల్ ట్రైనింగ్ నందు డిస్టిక్ ఇమినైజేషన్ ఆఫీస్ నుండి సిహెచ్‌ఓ ముని రెడ్డి ట్రైనింగ్ ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో వ్యాక్సిన్ యొక్క ప్రాముఖ్యత మరియు గోల్డ్ చైన్ సిస్టం గురించి వ్యాక్సినేషన్ వల్ల కలుగు లాభాలు గురించి తెలియజేయడమైనది ఆశా డే మీటింగ్ లో భాగంగా మలేరియాసబ్ యూనిట్ ఆఫీసర్ మురళీధర్ కూడా పాల్గొని డెంగ్యూ వ్యతిరేక మాస సందర్భంగా మలేరియా డెంగు చికెన్ వ్యాధుల గురించి తెలియజేశారు,

## ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**లక్కిరెడ్డిపల్లి మన జనప్రగతి జూలై 07:-** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం లక్కిరెడ్డిపల్లి మండలం కోనంపేట, లక్కిరెడ్డిపల్లి పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.బీఎల్‌వోలు ఇంటింటి సర్వే, హౌస్‌హోల్డ్ ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, నమోదు ప్రక్రియలను తనిఖీ చేసిన కలెక్టర్, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ఓటర్ల పేర్ల నమోదు, మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు.సేకరించిన సమాచారాన్ని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## బాలయ్యగారిపల్లి పోలింగ్ స్టేషన్‌లో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను పరిశీలించిన ఎంపీడీవ




**కలకడ, మన జనప్రగతి జూలై 07:-** మండలంలోని బాలయ్యగారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్ నెం.53లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) డిజిటలైజేషన్ ప్రక్రియను ఎంపీడీవో భాను ప్రసాద్ మంగళవారం పరిశీలించారు.డిజిటలైజేషన్ పనులను వేగవంతంగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. యాప్ వినియోగం, డేటా నమోదు, నెట్‌వర్క్ సమస్యలు, పత్రాల అప్‌లోడ్ వంటి అంశాలపై బీఎల్‌వోలు పుల్లయ్య, దేవేంద్రులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు.అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, గడువులోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎంఈఓ లీలారాణి



**పలమనేరు, మన జనప్రగతి, జూలై 07:-** పలమనేరు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఎంఈఓ పి. లీలారాణి మంగళవారం సందర్శించి, దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న విద్య, పునరావాస సేవలను పరిశీలించారు. ప్రస్తుతం కేంద్రంలో 22 మంది విద్యార్థులు సేవలు పొందుతున్నట్లు తెలుసుకున్నారు.అవసరమైన విద్యార్థులకు వీల్‌చైర్లు, ప్రత్యేక అభ్యాస మాడ్యూళ్లను పంపిణీ చేసి, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఉపాధ్యాయుల సేవలను ఎంఈఓ అభినందించారు.

## సిద్ధవటం ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

### - అక్రమ మద్యం, గంజాయిపై కట్టుదిట్టమైన నిఘాకు ఆదేశాలు

**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 07:-** మండల కేంద్రంలోని సిద్ధవటం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం కడప జిల్లా మద్యనిషేధ, అబ్కారీ అధికారి జె. రమేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్సైజ్ పరిధిలోని సిద్ధవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాల్లో అక్రమ మద్యం, నాటు సారా, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల తయారీ, రవాణా, విక్రయాలను అరికట్టేందుకు అనుమానిత ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేసి, ఆకస్మిక దాడులు నిర్వహించాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ రాజశేఖర్, ఎస్సై నారాయణ పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు చేయాలి: ఎమ్మెల్యే



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 07:-** ఈ ఏడాది జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు అంచనాలతో పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సూచించారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారాయని, ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదుకాలేదన్నారు. ప్రధాన జలాశయాల్లోకి కూడా తగినంత నీరు చేరలేదని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితేనే ఒక పంటకు సరిపడా సాగునీరు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్న ఆయన, ప్రస్తుత పరిస్థితుల్లో నీటి అవసరం తక్కువగా ఉండే వర్షాధార పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని సాగు నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, మాజీ శివాలయం పాలకమండలి సభ్యులు పల్లా శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాహక్కు చట్ట సవరణకు పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టండి

**జగన్మోహన్ రెడ్డికి ఫ్యాప్టో మరియు వై.ఎస్.ఆర్.టి.ఏ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 07:-** విద్యాహక్కు చట్టం లోనే 23వ సెక్షన్ సబ్ సెక్షన్ వన్ సవరించేలా పార్లమెంటులో చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని తద్వారా ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు లభించేలా కృషి చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి కి కడప జిల్లా ఫ్యాప్టో మరియువై.ఎస్.ఆర్.టి.ఏ శాఖ విజ్ఞప్తి చేసింది. మంగళవారం పులివెందులలోని ఆయన క్యాంప్ ఆఫీస్ లో కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సంగమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సోదర సంఘాల బాధ్యులతో కలిసి వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుని కలిసిన సందర్భంగా 2010 ఆగస్టు నుంచి అమలులోకి వచ్చిన విద్య హక్కు చట్టం అమల్లోకి వచ్చిందని కానీ అంతకుముందు ఉపాధ్యాయ వృత్తి లోకి ప్రవేశించిన వారిని కూడా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ పాస్ అవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో చట్టాన్ని ప్రోస్పెక్టివ్ గా 2010 నుంచి అమలు చేసేలా చట్ట సవరణకు పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు ఒకవైపు బోధన బాధ్యతలు ఉండగా మరొకవైపు టెట్టుకు ప్రిపరేషన్ కష్టసాధ్యంగా మారిందని పైగా బోధించే సంబంధిత సబ్జెక్టులు కాకుండా ఇతర సబ్జెక్టుల్లో కూడా పరీక్ష రాయాల్సి రావడం ఇబ్బందికరంగా ఉందని ఇతరుణంలో విద్యాహక్కు చట్ట సవరణ సరైన పరిష్కారంగా భావించి ఆ దిశగాలని కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు ఫాప్టో జిల్లా సెక్రెటరీ జనరల్ అబ్దుల్లా శ్యాంసుందర్ రెడ్డి,దాదా పీర్,రామాంజనేయులు,వెంకటనాథ్ రెడ్డి,అమర్నాథ్ రెడ్డి,శ్రీనివాసరెడ్డి,నిహారిక,విక్టర్,శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు

# పదోన్నతి పొందిన డీడీ, డిపిఆర్వోలకు ఆత్మీయ వీడ్కోలు, సన్మానం





**కడప మన జనప్రగతి జూలై 07:-** కాకినాడ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొందిన పద్మజ, అన్నమయ్య జిల్లా డీపిఆర్వోగా పదోన్నతి పై వెళుతున్న సునీల్ సాగర్ లకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక కాలెక్టరేట్ ప్రాంగణంలోని సమాచార పౌరసబంధాల శాఖ కార్యాలయంలో.. డీఐపిఆర్వోగా పనిచేసి పదోన్నతిపై డిడిగా కాకినాడ జిల్లాకు వెళ్తున్న బి. పద్మజకు, అలాగే ఇక్కడ డీఎల్ పిఆర్వోగా పనిచేస్తూ డిపిఆర్వోగా పదోన్నతి పొంది మదనపల్లె వెళుతున్న సునీల్ సాగర్ లకు.. ఆ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడుకోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చాలు అందించి దుశ్శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా.. పలువురు అధికారులు, సిబ్బంది వారి మనోభావాలను వ్యక్తం చేస్తూ పదోన్నతి పొందిన వారితో విధి నిర్వహణలో వారితో ఎదురైన అనుభవాలు, అనుబంధాన్ని అందరితో పంచుకున్నారు. ఎలాంటి విమర్శలు, వివాదాలకు తావు లేకుండా.. శాఖాధిపతిగా డీఐ పిఆర్వో పద్మజ, డివిజనల్ పిఆర్వోగా సునీల్ సాగర్ లు వారి విధుల్లో చేసిన అమూల్యమైన సేవలను కొనియాడారు. పదోన్నతిపై వెళుతున్న ప్రాంతాల్లో కూడా వారు అత్యున్నత సేవలను అందించి అందరి ఆదరాభిమానాలు చురగొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీడీ పద్మజ మాట్లాడుతూ.. కడప కార్యాలయంలో విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. మీ అందరి సహకారం, సమన్వయంతో ఇంతకాలం.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన అధికార విధులను నిర్వర్తించగలిగానన్నారు. ప్రతి అధికారికి బదిలీ అనేది సర్వ సాధారణమే అయినా.. ఒక సంవత్సర కాలం పాటు ఈ కార్యాలయంలో అందరితో కలిసి పనిచేసిన అనుభవం ఒక కుటుంబ వాతావరణాన్ని తలపించిందన్నారు. ఈ ప్రాంత వాతావరణం, ఇక్కడి మీడియా మిత్రుల అభిమానం, అధికారులు సిబ్బంది సమన్వయ సహకారం.. తనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. డిపిఆర్వో సునీల్ సాగర్ మాట్లాడుతూ.. కడప సమాచార శాఖ కార్యాలయంలో అందరూ బాధ్యతాయుతంగా పనిచేసే వారేనన్నారు. అందరూ కలిసికట్టుగా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకురావాలన్నారు. సర్వీసులో ఉన్న ప్రతి ఒక్కరికీ బదిలీలు సర్వ సాధారణం అయినప్పటికీ.. అత్యుత్తమ సేవలు అనేవి వారి పదోన్నతులకు సహకరిస్తాయని, ఆ దిశగా సిబ్బంది పారదర్శకంగా సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో డీఇఇఇ శ్రీనివాసరావు, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా, ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, కృపాకర్, ఫోటోగ్రాఫర్ సొహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, టీఏ హరిబాబు, వీరారెడ్డి, విజయ కుమారి, షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ వి. సుధా




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 07:-** చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంతో పాటు ఆశా కార్యకర్తల సమావేశం విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ పి. ఓబులేసు తెలిపారు. ఈ సందర్భంగా జి.వి. సత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ వి. సుధా గర్భిణీ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ వి. సుధా మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నడక అలవాటు చేసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని సూచించారు. ప్రతి నెల గర్భస్థ పరీక్షలు, మధుమేహం, రక్తపోటు, హీమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలని, హీమోగ్లోబిన్ తక్కువగా ఉన్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. అధిక ప్రమాద గర్భిణులను మెరుగైన వైద్య సేవల కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా మహిళలు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన పెంపొందించుకుని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు పి. ఓబులేసు, వి. సుధా సూచించారు. **గర్భిణులకు పోషకాహారం అందజేత** కార్యక్రమానికి హాజరైన గర్భిణులు, వారి సహాయకులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బందికి యన్. అనంతపురం గ్రామానికి చెందిన మైల రాజగోపాల్ గంగమ్మ దంపతులు సుమారు 80 మందికి పోషక విలువలు కలిగిన భోజనాన్ని అందజేశారు. వారి సేవలను అభినందిస్తూ గర్భిణులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది సమక్షంలో శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. రాఘవయ్య, సూపర్‌వైజర్లు ప్రసాద్, భవానీ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉరవకొండ నియోజకవర్గం ఏపీడబ్ల్యూజేఎఫ్ కమిటీ ఏకగ్రీవం

**• అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రేగటి భీమప్ప, పీవై సుంకన్న • గౌరవ అధ్యక్షులుగా మాలపాటి శ్రీనివాసులు • రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పులివారి హరిప్రసాద్**



**ఉరవకొండ మన జనప్రగతి జూలై 07:-** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్( ఏపీడబ్ల్యూజేఎఫ్ )ఉరవకొండ నియోజకవర్గం కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలుగా ఆర్. భీమప్ప ( ఏపీ టుడే ), పీవై సుంకన్న( సాక్షి)లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అలాగే నియోజకవర్గం గౌరవ అధ్యక్షులుగా మాలపాటి శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా పులివారి హరిప్రసాద్ లు ఎన్నికయ్యారు. మంగళవారం నాడు ఉరవకొండ పట్టణంలోని లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్( ఏపీడబ్ల్యూజేఎఫ్ ) అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు ( ఐ న్యూస్ బ్యూరో), ఏపీడబ్ల్యూజేఎఫ్ సీనియర్ నాయకులు డాక్టర్ సూర్య ( 6 టీవీ బ్యూరో) హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉరవకొండ నియోజకవర్గం అధ్యక్షులుగా ఆర్. భీమప్ప, ఉపాధ్యక్షులుగా సాల్మన్ రాజ్ ( ప్రజాశక్తి ), వీరేష్ ( సాక్షి రూరల్), జీటీ పాల్ ( జనసూర్య శ్రీ), ప్రధాన కార్యదర్శిగా పీవై సుంకన్న ( సాక్షి ), కార్యదర్శులుగా సీహెచ్ ఓబులేసు ( వెటరన్ జర్నలిస్టు), బలరాం ( ఆర్ టీవీ ), మధుబాబు ( 7 ఎస్టీవీ ), కోశాధికారిగా మొహియుద్దీన్ ( బిగ్ టీవీ ), కార్యవర్గ సభ్యులుగా బాలచంద్ర ( జ్యోతి ), రాజేష్ ( జనసూర్య శ్రీ), రంగస్వామి ( సాక్షి ), కార్తీక్ ( వార్తా బలం ), నాగభూషణం ( నవ భూమి ), శ్యామ్ కిరణ్ ( వైఎస్ఆర్ టీవీ ), సంజప్ప ( ప్రజా సంక్షేమం మాస పత్రిక ), శివ ( సూర్య ), అఖిల్ ( గోదావరి డైలీ ), బి. రమేష్ ( లేపాక్షి టైమ్స్), బి. ఉమాపతి ( 6 టీవీ ) తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా మాలపాటి శ్రీనివాసులు ( జన ప్రగతి ), ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పులివారి హరిప్రసాద్ ( అసోసియేట్ ఎడిటర్, ధర్మవిజేత ) లను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఉరవకొండ,ఏం. రామాంజనేయులు జమీల్ ఏళ్ళ సాయి ,వజ్రకరూరు, విడపనకల్లు, బెలుగుప్ప, కూడేరు మండలాలకు చెందిన పాత్రికేయులు హాజరయ్యారు.

# హోంగార్డుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



**కాకినాడ మన జనప్రగతి జూలై 07:-** శాంతిభద్రతల రక్షణ ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో స్టేషన్ హౌస్ నందు బయట పోలీసులతో సమానంగా వాలంటీర్లుగా శ్రమిస్తున్న హోంగార్డుల పెండింగ్ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 15వేల మంది హోం గార్డులుండగా 2వేల నుండి 3వేల హోంగార్డు పోస్టులు భర్తీ చేయాల్సి వుందన్నారు. 1,500 నుండి 1,800 మంది వరకు మహిళా హోంగార్డులు విధులను నిర్వహిస్తున్నారని, ముఖ్యంగా కాకినాడ జిల్లా పరిధిలోనే 918 మంది హోంగార్డులు పనిచేస్తున్నార న్నారు. హోంగార్డులకు నెలకు రూ. 21,300 వేతనం (రోజుకు రూ. 710) వస్తున్నట్లు కాగితాల్లో ఉన్నప్పటికీ, వెల్ఫేర్ మరియు అసోసియేషన్ ఫండ్స్ కింద కటింగ్స్ పోను కేవలం రూ. 20,800 వరకు మాత్రమే చేతికి అందుతుందని, ఆ జీతాలు కూడా సర్వర్ మరియు బడ్జెట్ సాకులతో ప్రతి నెలా 10 నుండి 15 రోజులు ఆలస్యంగా రావడం వల్ల వారి జీవన ప్రమాణాలు దెబ్బతింటు న్నాయన్నారు. చట్టపరంగా వీరు 'స్వచ్ఛంద సేవకులు' కావడంతో 'పని లేకపోతే జీతం లేదు' అనే అమానవీయ నిబంధనతో సెలవు పెడితే జీతం కట్ చేస్తున్నారని, వీరికి కనీస క్యాజువల్, మెడికల్ లీవ్స్ లేకపోవడంతో పాటు మహిళా హోంగార్డులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కూడా ఇవ్వడం లేదన్నారు. ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లయినా ఏపీ తెలంగాణల మధ్య పరస్పర బదిలీల కోసం ఎదురుచూస్తున్న 400 మంది హోంగార్డుల ఫైల్‌ను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తొక్కిపెట్టడం తీవ్రమైన ఉల్లంఘన గా పేర్కొన్నారు. హోంగార్డుల సంక్షేమం కొరకు సుప్రీంకోర్టు చారిత్రాత్మక ఆదేశాల ప్రకారం "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని అమలు చేస్తూ పోలీసులతో సమానంగా కనీస బేసిక్ పే + డీఏ అందించాలన్నా రు. దశాబ్దాలుగా సేవ చేస్తున్న హోంగార్డులను క్రమబద్ధీకరించి, ఏకపక్ష తొలగింపులు లేకుండా పూర్తి ఉద్యోగ భద్రత కల్పించా లన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో వేతనాలు పడేలా ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. కక్షసాధింపు బదిలీలను, వేధింపులను తక్షణమే అరికట్టాలన్నారు హోంగార్డులకు వేతనంతో కూడిన క్యాజువల్, మెడికల్ సెలవులను మంజూరు చేస్తూ, మహిళా సిబ్బందికి ప్రసూతి సెలవుల సౌకర్యం కల్పించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన హోంగార్డుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాల ప్రక్రియను మరింత సరళతరం చేయాలన్నారు. హోంగార్డుల హక్కుల కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక జీవో ఇవ్వాలని రమణ రాజు కోరారు.

## పాపానాయుడుపేట బీడీసీ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్



**ఏర్పేడు మన జనప్రగతి జూలై 07:-** ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న బీడీసీ సెంటర్ (మినీ గ్రంథాలయం)ను ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. సెంటర్‌లో పాఠకులకు అందుతున్న పత్రికలు, పుస్తకాల వివరాలను నిర్వాహకురాలు మంజులమ్మను అడిగి తెలుసుకున్నారు. పెద్ద పంచాయతీ అయిన పాపానాయుడుపేటలో పాఠకులకు మరిన్ని పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే బీడీసీ సెంటర్ అభివృద్ధికి సహకరించాలని స్థానిక నాయకులను కోరుతూ, రేణిగుంట శాఖ గ్రంథాలయం ద్వారా మరిన్ని పుస్తకాలు, న్యూస్ పేపర్లు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి: ఎస్‌ఎఫ్ఐ



**ఉరవకొండ, మన జనప్రగతి జూలై 01:-** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉరవకొండ ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వొకేషనల్ విద్యార్థులకు తగిన తరగతి గదులు కల్పించాలని, ఎంఎల్‌టీ, ఎంఫీహెచ్‌డబ్ల్యూ కోర్సులు ప్రారంభించాలని కోరింది. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ కారణంగా విద్యార్థులు సర్టిఫికెట్లు, హాల్‌టికెట్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని పేర్కొంది. పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు, స్టేషనరీని వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, మండల అధ్యక్షుడు రాజేష్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారులకు సత్కారం



**వజ్ర కరూర్ మన జనప్రగతి జూలై 07:-** మంగళవారం ఉదయం వజ్రకరూరు మండలంలోని వజ్రకరూరు నూతన తాహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన జయశ్రీ ని మరియు గత కొంతకాలం నుండి వజ్రకరూరు మండలంలో శాంతిభద్ర తలు కాపాడుతూ విశిష్ట సేవలందిస్తూ ప్రజల మన్నలను పొందుతున్న వజ్రకరూరు మండల సబ్ ఇన్స్పెక్టర్ ఎం నాగ స్వామి ని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్ యాద వ్ ఏపీ మోడల్ స్కూల్ అండ్ కాలేజ్ ప్రిన్సిపల్ గంగాధర్ అధికా రులను ఘనంగా సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ అధ్యాపకులు రవిచంద్ర మరియు జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను గడువు లోపు పూర్తి చేయాలి

**- 167- నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి.**

**తిరుపతి మన జనప్రగతి జూలై 07:-** ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని గడువు లోపు పూర్తి చేయాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తిరుపతి నియోజకవర్గ పరిధిలోని పూలవాణి గుంట, కొరమేనుగుంట, కొర్లగుంట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అన్ని చోట్ల ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వివరాలు నమోదు చేయించాలని తెలిపారు. దశలవారీగా బిఎల్‌ఏలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వ్యక్తిగతంగా కలిసి వారికి అవసరమైన మార్గదర్శకాలు, అవగాహన కల్పించాలని తెలిపారు. అందరూ ఈ ప్రక్రియను ఎటువంటి అవకతవకలు జరగకుండా, జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.లు లలిత, శిల్ప, బూత్ లెవెల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మనజనప్రగతి

08 - 07 - 2026



## కానిస్టేబుల్ గండే వెంకటేశ్వర్లుకు సుగవాసి ప్రసాద్ బాబు నివాళి

**రాయచోటి మన జనప్రగతి, జూలై 07:**అనారోగ్యంతో మృతి చెందిన సుండుపల్లి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ గండే వెంకటేశ్వర్లుకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అలాగే రాయచోటికి చెందిన మయాన హబీబుల్లా ఖాన్, మసీవుల్లా ఖాన్ తల్లి, చెన్నూరు మస్తాన్ తండ్రి మహబూబ్ బాషా మృతిపట్ల కూడా నివాళులర్పించి, వారి కుటుంబాలను ఓదార్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఏపీజీబి మేనేజర్‌కు ఘన వీడ్కోలు



**రామాపురం మన జనప్రగతి జులై 07:-** మండల కేంద్రమైన రామాపురం లోని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో మేనేజర్ గా పని చేస్తున్న ఇంతియాజ్ బదిలీపై వెళుతున్న సందర్భంగా రామాపురం మండల వెలుగు సిబ్బంది వివోఏలు 30 మంది మరియు ఏపీఎం సీసీలు అందరూ కలిసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మేనేజర్ ఇంతియాజ్ మాట్లాడుతూ రామాపురం మండలంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో మేనేజర్ గా పని చేసిన రెండు సంవత్సరాల కాలంలో అందరి ఆదరాభిమానాలు పొందారని అనిమేటర్ల కోపరేషన్ వలన నేను హెడ్ ఆఫీస్ లో చాలా అవార్డులు కూడా సాధించాననీ ఇటువంటి ప్రాంతాన్ని నేను ఎప్పుడు కూడా మర్చిపోలేనని అన్నారు ఐనా ప్రతి ఉద్యోగికి బదిలీ పై వెళ్లడం సర్వ సాధారణం అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో తోటి బ్యాంక్ ఉద్యోగులు, వీ,ఓ,ఏ,లు సి సీ,లు ఏ,పీ,ఎం ,యమ్, ఎస్ అధ్యక్షురాలు డ్వాక్రా సంఘ సభ్యులు తమ అభిప్రాయాన్ని వెళ్ళబుచారు,ఇలాంటి మేనేజర్ రామాపురం మండలానికి రావడం అదృష్టం అని ఇలాంటి వారు బదిలీపై వెళుతున్నందుకు బాధగా ఉందని ఇలాంటివారు మళ్లీ అరుదుగా వస్తూ ఉంటారని రామాపురం మండల వెలుగు మండల అధ్యక్షుడు జయరాం తన మనోభావాలను వివరించారు.

## వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



**కడప మన జనప్రగతి జూలై 07:-** వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కడప మహావీర్ సర్కిల్ నందు కేక్ కటింగ్ చేసి వికలాంగులకు, పేదలకు, అల్పాహారం పంచారు.అనంతరం విలేఖరులతో రాష్ట్ర వికలాంగుల పోరాట సమితి అధ్యక్షులు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్ మాట్లాడుతూమా నాయకుడు మందకృష్ణ మాదిగ నిండు నూరేళ్లు, అష్టైశ్వర్యాలతో ఉండాలని .మంచి పదవి అలంకరించాలని. ఇంకా ప్రజలకు సేవ చేయాలని కోరుతున్నామని తెలిపారు. మహావీర్ సర్కిల్ నుండి ఆర్టీసీ బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీతో పోయి అక్కడ కేక్ కట్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతయ్య ,ఆంజనేయులు, లక్ష్మీదేవి, జిల్లాలోని వికలాంగులందరూ పాల్గొన్నారు.

# పొగాకు వేలం కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### ● వర్జీనియా పొగాకు కొనుగోళ్లపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష



**అమరావతి మన జనప్రగతి జూలై 07:-** వర్జీనియా పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సామాజిక సంక్షేమ, విద్యుత్, రెవెన్యూ శాఖల మంత్రులతో పాటు టొబాకో బోర్డు చైర్మన్, టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆక్షన్ ప్లాట్‌ఫార్మ్‌ల పరిస్థితి, కొనుగోళ్ల పురోగతి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి సమగ్రంగా చర్చించారు. ఈ నెల 9న టొబాకో బోర్డు కేంద్ర సంయుక్త కార్యదర్శి (జీశీఅఙ్ ూవఖఙీఞ్ఖుఙీఎ) ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న నేపథ్యంలో రైతులు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అధిక రిజెక్షన్ నమోదవుతున్న ఆక్షన్ ప్లాట్‌ఫార్మ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. పొగాకు వేలం కేంద్రాలను సంబంధిత సహచర మంత్రులు స్వయంగా సందర్శించి రైతులతో మాట్లాడాలని, కంపెనీల సిండికేట్ వ్యవహారాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఆక్షన్‌లలో పాల్గొనకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా, వర్జీనియా పొగాకుకు న్యాయమైన ధరలు లభించే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టోబాకో బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ, చైర్మన్ చిడిపోతు యస్వంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం సందర్భంగా మొక్కల నాటకం



**కాకినాడ, మన జనప్రగతి, జూలై 07:-**జేఎన్టీయూకే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, ఓఎన్జీసీ లిమిటెడ్, ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం సందర్భంగా మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు.జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ ప్రొ. సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొ. కె. పద్మరాజు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## చంద్రగిరి ఎమ్మెల్యేని కలసిన జేబీ శ్రీనివాస్



**తిరుపతి మన జనప్రగతి జులై 07:-** తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గం ఇన్చార్జిగా నియమితులైన జేబీ శ్రీనివాస్ మంగళవారం చిత్తూరులో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన తనయుడు పులివర్తి వినీల్ ను జేబీ శ్రీనివాస్ శాలువలు వేసి సత్కరించారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ స్థానిక రాజకీయాలపై కొద్దిసేపు ఇద్దరు ఏకాంతంగా చర్చించుకున్నారు. జేబీ శ్రీనివాస్ తో పాటు శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, టీడీపీ యూనిట్ ఇంచార్జ్ లు మాచర్ల రఘురామ్, జగదీష్,రాజేష్, కాలేషా లు ఉన్నారు.

# బగ్గుమన్న అనూష ఆత్మహత్య

### - డీఎస్పీ హామీతో ధర్నా విరమణ





**పోరుమామిళ్ల/ బి.కోడూరు,మన జనప్రగతి జులై 07 :-** ఐత్రంపేట అనూష ఆత్మహత్య సంచలనం రేకెత్తించింది. ధర్నాతో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆదివారం ఆమె మరణించినప్పటికీ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుంచి తీసుకెళ్లలేదు, ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్ట్ చేయాలని మంగళవారం ఉదయం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి ముందు మృతురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో ధర్నాకు దిగడం జరిగింది. మూడు రోజులవుతున్నప్పటికీ అనూష ఆత్మహత్యకు కారణమైనవారిని అరెస్ట్ చేయలేదని పోలీసులను గట్టిగా నిలదీయడం జరిగింది. రూరల్ సీఐ నిందితులతో లాలూచి పడి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని గట్టిగా బహిరంగంగా మాట్లాడుతూ డిఎస్పికి, మీడియాకు చెప్పడం జరిగింది. మృతురాలు అనూష భర్త సాయి నాథ్ రెడ్డి , అత్త మామలు, భర్త అక్క, భావలను అరెస్ట్ చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేయడం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రి ముందు ప్రధాన రహదారి మీద ధర్నాకు దిగడంతో దాదాపు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయి ప్రయాణీకులు, వాహనదారులు, ప్రజలు గంటపాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డిఎస్పితోపాటు స్థానిక సీఐ, ఎస్ఐ లు, బద్వేల్ ఎస్ ఐ లు, బి.కోడూరు, కాశినాయన ఎస్ఐలు పోలీస్ సిబ్బంది ఆఘమేఘాలమీద ధర్నా స్థలానికి చేరుకోవడం జరిగింది. డిఎస్పి రాజేంద్ర ప్రసాద్ భాదితులతో మాట్లాడుతూ... ఎఫ్ఐఆర్ లో వున్న ఎవరినీ తప్పించడం జరుగదని, అందరినీ అరెస్ట్ చేయడం జరుగుతుందని అపోహలు వద్దని అన్నారు. ఈ డౌరీ కేసు సీఐ పరిధిలోది కాదని నా పరిధిలోనిదని, నేను సెలవులో ఉండడంవల్ల ఒక్కరోజు ఆలస్యమైందని, నేనే స్వయంగా విచారణ చేస్తానని ఖచ్చితంగా న్యాయం చేస్తానని నచ్చచెప్పి హామీ ఇవ్వడంతో ధర్నాకు పులిస్టాప్ పడింది.

# దళితుల భూములు దళితులకు అందేలా చూడాలి

### ● సిపిఐ నాయకులు చిన్నయ్య ఆధ్వర్యంలో ఓబులవారిపల్లి రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసనలు



**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 07:-** తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం వైకోట రెవిన్యూ పొలం సర్వేనెంబర్ 10 66 లో దాదాపు 524 ఎకరాలు ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా అందులో భూకబ్జాదారుల నుంచి ఆక్రమించుకొని మిగులు భూమి 30 ఎకరాల ఉండడంతో అదే పంచాయతీకి చెందిన తిరుగుడుపల్లి దళితులు కొన్ని సంవత్సరాలుగా ఆ భూమిని అనుభవంలో ఉంచుకొని సదును చేసుకొని పంటలు పండించుకుంటూ ఉండేవారిని ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూమిని కొందరు భూకబ్జాదారు. రాత్రికి రాత్రి చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నించగా దళితులు అడ్డుకొని యంత్రాలను వెనక్కి పంపించారని సిపిఐ నాయకులు చిన్నయ్య మంగళవారం ఇన్చార్జి తాసిల్దార్ సిద్దేశ్వర రావుకు వినతి పత్రం అందించి దళిత భూములు దళితులకు అందేలా చూడాలని విన్నవించుకున్నారు. అనంతరం భూ కబ్జాదారుల నుంచి దళితుల భూములు దళితులకు అందేలా చర్యలు తీసుకోవాలని నిరసనలు వ్యక్తం చేశారు తాసిల్దార్ స్పందించి ఫీల్డ్ కి వస్తానని రికార్డులు తనిఖీ చేసి అర్హులైన దళితులకు భూములు అందేలా తమ వంతు కృషి చేస్తామన్నారు అంతేకాకుండా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వందల ఎకరాలు ఆక్రమణదారుల కబంధహస్తాలలో ఉన్నాయని చిన్న వరంపాడు రెవెన్యూ పొలంలో కొందరు అక్రమంగా ఇల్లులు దివ్యకడుతున్నారని వీఆర్వోలు సంబంధిత అధికారులు చూసి చూడనట్లు పట్టినట్లు వ్యవహరిస్తున్నారని సిపిఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కార్యకర్తలు ఉన్నారు

## డెంగీ నివారణపై విడపనకల్లులో అవగాహన ర్యాలీలు, సమావేశాలు




**విడపనకల్లు, మన జనప్రగతి జూలై 07:-** విడపనకల్లు మండలంలోని విడపనకల్లు, గడేకల్లు, పాల్తూరు, వేల్పుమడుగు గ్రామాల్లో మంగళవారం డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి డి. వెంకటేశ్వరమ్మ, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి సి. రాధాకృష్ణ, విడపనకల్లు, పాల్తూరు, కొట్టాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డా. ఎం. పుష్ప, డా. ఎస్. శివశంకర్ నాయక్, డా. జయకుమార్ నాయక్, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామ్ రెడ్డి పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగీ, మలేరియా, మెదడువాపు, బోధకాల వ్యాధి, చికెన్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డెంగీ లక్షణాలు, నివారణ చర్యలను వివరించి, వ్యాధులు వచ్చిన తర్వాత ఆస్పత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయడం కంటే ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు కంబయ్య, కుత్బుద్దీన్, డి. సుధాకర్, అమృతలత, హెల్త్ అసిస్టెంట్లు నూరు మహమ్మద్, శివరామకృష్ణారావు, శ్రీనివాసులు, విడపనకల్లు, గడేకల్లు, వేల్పుమడుగు, పాల్తూరు గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈవోఆర్డీ సత్యబాబు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జేబీ. శ్రీనివాస్‌ను కలసిన భూమన ముఖ్య అనుచరుడు



**తిరుపతి మన జనప్రగతి జులై 07:-** తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన జేబీ శ్రీనివాస్ ను మంగళవారం వైసిపి మాజీ ఎమ్మెల్యే, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అనుచరుడు, వైసీపీ ఎస్సీ సెల్ నేత రాజేంద్ర గజ పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో జేబీ శ్రీనివాస్ రాజకీయంగా తెలుగుదేశం పార్టీలో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని రాజేంద్ర ఆకాంక్షించారు. వైసీపీ నేత రాజేంద్ర టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జేబీ శ్రీనివాస్ ను కలవడంతో త్వరలో రాజేంద్ర తెలుగుదేశం పార్టీలో చేరడం ఖాయమని టిడిపి నేతలు చెబుతున్నారు. తిరుపతిలో వైసీపీ నేతలు, కార్యకర్తలు టిడిపిలో జేబీ సమక్షంలో టిడిపిలో చేరేందుకు క్యూ కట్టడం ఖాయమని స్థానికంగా ఉండే కూటమి నేతలు చెబుతున్నారు.

## ఓటర్ల సవరణ ప్రక్రియను పక్కాగా చేపట్టాలి: తహసిల్దార్ నజీర్ అహ్మద్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 07:-**ఓటర్ల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్ )కార్యక్రమంలో భాగంగా మండల,నియోజకవర్గ స్థాయిల్లో ఓటర్ల సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ఎన్నికల ప్రత్యేక అధికారి,పులివెందుల తహసిల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు.జూలై 7వ తేదీ నాటికి అందిన వివరాల ప్రకారం పులివెందుల మండలంలో 57.3 శాతం, నియోజకవర్గ స్థాయిలో 63.63 శాతం ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తయిందని ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి బూత్ లెవెల్ అధికారి (బిఎల్ఓ) ఓటర్ల సవరణ ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా అత్యంత ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు.చనిపోయిన వారి వివరాలను,ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఖచ్చితంగా ధృవీకరించి, సంబంధిత యాప్‌లో తక్షణమే అప్‌లోడ్ చేయాలని, నియోజకవర్గంలో అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా రద్దు కాకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రతి బిఎల్ఓపై ఉందని ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ఈ సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08 - 07 - 2026

## నేడు ఇడుపులపాయకు పిసిసి ఛీఫ్ షర్మిలా రాక



**వేంపల్లె మన జనప్రగతి జులై 07:–**ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా బుధవారం ఇడుపులపాయకు రానున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా పిసిసి ఛీఫ్ షర్మిలా ఇడుపులపాయకు వచ్చి వైఎస్ఆర్ సమాధికి నివాళులర్పించనున్నారు. షర్మిలా రెడ్డి 8.30 నిమిషాలకు వైఎస్ఆర్ ఘాట్ కు తల్లి విజయమ్మతో కలిసి చేరుకొని అక్కడ ప్రత్యేక ప్రార్ధనలు చేయనున్నారు. ప్రార్ధనలు అనంతరం ఆమె ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గెస్ట్ హౌస్ కు చేరుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు.

## 7వ సచివాలయంలో రైతులకు యూరియా పంపిణీ

**వేంపల్లె మన జనప్రగతి జులై 07:** స్థానిక 7వ సచివాలయంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి బాల గంగధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేది నుండి రాష్ట్ర ప్రభుత్వం రైతుల కొరకు సరఫరా చేసిన యూరియాను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాబట్టి ఆయా పంటలు సాగు చేసిన రైతులు యూరియా కావాలంటే వేంపల్లెలోని శ్రీ చైతన్య పాఠశాలకు వెళ్లే రహదారిలో ఉన్న 7వ సచివాలయం వద్దకు రావాలని కోరారు. యూరియా కోసం వచ్చే రైతులు భూమి పాసు పుస్తకం, ఆధార్ కార్డును, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ ను తప్పకుండా తీసుకొని రావాలని కోరారు. ఈ అవకాశాన్ని యూరియా కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: డీఎస్పీ వై.శ్రీనివాసరావు



**రైల్వే కోడూరు మన జనప్రగతి జులై 07:–** ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాల నివారణలో ఆటో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు రైల్వే కోడూరు పోలీస్ స్టేషన్లో అర్బన్ సీఐ చంద్రశేఖర్ రావు, ఎస్సై ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి చర్యలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతాయని హెచ్చరించారు. పాఠశాలలుఆసుపత్రులు, రోడ్డు కూడళ్లు, జనసమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక అప్రమత్తతతో వాహనాలు నడపాలని కోరారు. ప్రతి ఆటోలో చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బీమా, కాలుష్య నియంత్రణ (పీయూసీ) ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అలాగే బ్రేకులు, లైట్లు, ఇండికేటర్లు, టైర్లను తరచూ తనిఖీ చేసి వాహనాలను రోడ్డు యోగ్యంగా ఉంచాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని, మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా డయల్–112కు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని డీఎస్పీ వై. శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## దేవాలయాల బాగుకే ధూప దీప నైవేద్య పథకం: జిల్లా సహాయ కమిషనర్ శంకర్ బాలాజీ.



**వేంపల్లె మన జనప్రగతి జులై 07:–** గ్రామాల్లో నిరాదరణకు గురైన దేవాలయాల బాగుకే ప్రభుత్వం ధూప దీప నైవేద్య పథకం ప్రవేశపెట్టిందని జిల్లా దేవా దాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ శంకర్ బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలం లోని తాటిమాకులపల్లి శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయమంతా అపరిశుభ్రంగా ఉండడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. దేవస్థాన అర్చకులు అందుబాటులో లేకపోవడాన్ని ఆయన గుర్తించారు . ఈ దేవస్థానానికి మంజూరు చేయుచున్న ధూప దీప నైవేద్యం పథకాన్ని నిలిపి వేసేందుకు నివేదికలు పంపాలని ఆయన మండల ఇన్చార్జి కార్యనిర్వాహ అధికారి సుభాష్ ను ఆదేశించారు. ఈ ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా, దేవస్థానంలో ఆలయ దర్శన వేళలు, అర్చకవివరాలు , వంటి వాటిపై సూచిక బోర్డు ఏర్పాటు చేయవలసిందిగా ఏసి ఆదేశించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో పేదలకు సంక్షేమం దూరం: ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 07:–** పులివెందుల నియోజకవర్గ ప్రజల నుండి వినతులు స్వీకరిస్తూ మరియు సమస్యలను పరిష్కరిస్తూ జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తన క్యాంపు కార్యాలయం నందు ప్రజలతో మమేకమై వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఎంపీ అవినాష్ రెడ్డికి వినతులు అందించగా సంబంధిత అధికారులతో చర్చించి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీల అమలులో అలసత్వం వహిస్తూ పేద ప్రజలకు సంక్షేమాన్ని దూరం చేస్తోందని వీటన్నింటినీ ప్రజలకు తెలియజేసి ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలని కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

### • 10న రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు వినతులు



**హైదరాబాద్ మన జనప్రగతి జూలై 07:–** రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ ఈనెల 10వ తేదీన "జర్నలిస్టుల వినతులు"అనే కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఆర్టీసీ బస్ చార్జీల్లో 1/3 వంతు రాయితీ కల్పించినప్పటికి ఆర్టీసీ సంస్థ మాత్రం దాదాపు 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని, దీనివల్ల నిత్యం వార్తా సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు భారమవుతుందని అన్నారు. ప్రభుత్వం చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సదుపాయం అమలు చేస్తుందని, అయితే ఇటీవల కాలంలో టోల్ ఫీజు, సర్వీస్ చార్జి పేరుతో మూడోవంతు చార్జీలను 50 శాతానికి పెంచారని తెలిపారు. పేరుకే 1/3 చార్జీలని, కానీ 50% చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినప్పటికి జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ ప్రభుత్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారని, అటువంటి జర్నలిస్టులు వార్తల సేకరణ కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుందని, ఫలితంగా ఆర్టీసీ ప్రయాణ చార్జీల భారం విపరీతంగా పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ...కొద్ది సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల ప్రభుత్వానికి, ఆర్టీసీ సంస్థకు పెద్ద ఆర్థిక భారమేమీ పడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు అన్ని అర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని వారు కోరారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు అనగా ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రీజినల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు డిపో మేనేజర్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలను కఠినతరం చేయాలి

### జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప మన జనప్రగతి జూలై 07:–** రోడ్డు భద్రత చర్యల నిబంధనలు, ఆంక్షలను కఠినతరం చేస్తూ.. జిల్లాలో రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హాజరయ్యారు. సమావేశంలో.. రవాణా, పోలీసు, జాతీయ రహదారుల సంస్థ, ఆర్అండ్బీ, మున్సిపల్, వైద్య తదితర శాఖల అధికారులతో కలిసి రహదారి భద్రత, ప్రమాదాల నివారణ చర్యలు, జీరో ఫ్యాటాలిటీ జిల్లా కార్యక్రమం, జాతీయ రహదారులపై ఆక్రమణల తొలగింపు, పాఠశాలల పరిసరాల్లో భద్రతా చర్యలపై ఆయా శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2026 జనవరి నుంచి జూన్ వరకు జరిగిన రహదారి ప్రమాదాల గణాంకాలను సమావేశంలో పరిశీలించారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే మొత్తం ప్రమాదాల సంఖ్య స్వల్పంగా పెరిగినా, మరణాల సంఖ్య తగ్గినట్లు అధికారులు వివరించారు. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య అత్యధిక ప్రమాదాలు నమోదవుతున్నాయని గుర్తించి, ఆ సమయంలో ప్రత్యేక గస్తీ, ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనల అమలును మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం, హిట్ అండ్ రన్ ఘటనలు, పాదచారుల భద్రత లోపించడం వంటి కారణాలతో అధిక మరణాలు సంభవిస్తున్నాయని అధికారులు వివరించగా, ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు కఠిన అమలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే 92 కీలక ప్రాంతాలను గుర్తించినట్లు సమావేశంలో వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లు, జీబ్రా క్రాసింగ్లు, సోలార్ బ్లింకర్లు, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ తదితర రహదారి భద్రతా సదుపాయాలను అత్యవసరంగా ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. జాతీయ రహదారులపై ఆక్రమణలను పూర్తిగా తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మాణాలు, వీధి వ్యాపారుల తరలింపు వంటి చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎంపికైన ఆరు జీరో ఫ్యాటాలిటీ జిల్లాల్లో వైఎస్సార్ కడప జిల్లా ఒకటిగా ఉన్నందున, ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో తక్కువ వ్యయంతో ఎక్కువ ఫలితాలు ఇచ్చే భద్రతా చర్యలను వెంటనే అమలు చేయాలని, దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాలల పరిసరాల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, రోడ్డు భద్రతపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మైనర్లు వాహనాలు నడపకుండా పర్యవేక్షించడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యంతో రహదారి భద్రతా సంస్కృతిని పెంపొందించాలని సూచించారు. రహదారి ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని, గుడ్ సమారిటన్ పథకం, పీఎం రాహత్ నగదురహిత చికిత్స పథకం అమలును మరింత సమర్థవంతంగా కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారం, పరిహారం చెల్లింపులు, పెండింగ్ కేసుల పురోగతిని వేగవంతం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. అదేవిధంగా, పదేపదే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారి డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేసే ప్రక్రియను కొనసాగించాలని, పోలీసు–రవాణా శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించి నిర్దేశించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ వీర్రాజు, కే ఎంసి అధనపు కమిషనర్ రాకేష్ చంద్రం, జెడ్పి సీఈవో, డిపివో సుబ్రహ్మణ్యం, ఆర్ అండ్ బి శాఖ ఎస్.ఈ. చంద్రశేఖర్, కమిటీ సభ్యులైన విద్యుత్ శాఖల ఎస్.ఈ.లు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, రోడ్ సేఫ్టీ డి.ఎస్.పి, ఐరాడ్ జిల్లా కోఆర్డినేటర్, రోడ్డు భద్రత ఎన్.జి.ఓ.ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## 2 కేజీల కేజీల గంజాయి పట్టివేత




**రామాపురం మన జనప్రగతి జులై 07:–**రామాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రీన్ పార్క్ హోటల్ వద్ద రెండు కేజీల గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న కమలాకర్ రెడ్డి వ్యక్తి నుంచి ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలను మేరకు పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారని రాయచోటి డి జనల్ పోలీస్ ఆఫీసర్ కృష్ణమోహన్ మీడియా సమావేశం నిర్వహించార కమలాకర్ రెడ్డి అనే వ్యక్తి బెంగళూరులో పీజీ హాస్టల్లో ఉంటూ ఒక నెట్వర్క్ లో భాగస్వామిగా ఉంటూ యువతకు గంజాయి విక్రయాలు చేస్తున్నాడని కచ్చిన సమాచారంతో కమలాకర్ రెడ్డి వద్దనుండి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డిఎస్పి తెలిపారు కమలాకర్ రెడ్డి వైజాగ్ నుండి పెద్ద మొత్తంలో గంజాయి కొనుగోలు చేసి బెంగళూరులో యువకులకు 50 గ్రాములు చొప్పున పొట్లాలు విక్రయాలు చేస్తున్నాడని ఆన్లైన్ ద్వారా ఒక యాప్ను తయారు చేసుకుని ఆ యాప్ ద్వారా ఎవరికీ అనుమానం రాకుండా నిందతుడు పిక్రయాలు చేసేవాడని డిఎస్పి తెలిపారు నిందితుడు కమలాకర్ రెడ్డి బిటెక్ విద్యను అభ్యసించి చెడు వ్యసనాలకు బానిసై వక్రమార్క నేర్చుకున్నారని తెలిపారు ఈ నెట్వర్క్ లో కొంతమంది సభ్యులు పాలుపంచుకున్నారని విచారణలో వెళ్ళడైందని తెలిపారు**తల్లిదండ్రులకు సూచన** ఇతర ప్రాంతాలలో ఉంటున్న యువత యువత తల్లిదండ్రులు తమ బిడ్డలు ఏం చేస్తున్నారు ఎటువంటి వాతావరణంలో ఉంటున్నారని పరిశీలించాలని తల్లిదండ్రులకు సూచించారు యువత అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొని తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకోవద్దు నూతన కోరారు **పోలీసులను అభినందించిన డి.ఎస్.పి** చాకచక్యంగా వ్యవహరించి నిందితుడు నుండి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న లక్కిరెడ్డిపల్లి సీఐ కృష్ణంరాజు నాయక్ రామాపురం సభ్యులు పోలీస్ శివకుమార్ మరియు పోలీసులను అభినందించారు

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174